కోదాడ బీఆర్‌ఎస్‌లో కల్లోలం

- పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన శశిధర్‌రెడ్డి
- అసమ్మతి నేతల ఇంటికి వెళ్లి ఆహ్వానించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రెండు రోజుల్లో సమష్టిగా నిర్ణయం తీసుకుంటామన్న చందర్‌రావు

కోదాడ : కోదాడ నియోజకవర్గ అధికార బీఆర్‌ఎస్‌ నాయకులు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడమే కాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్‌లో చెలరేగిన అసమ్మతిని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి కాంగ్రెస్‌ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చకచకా పావులు కదిపారు. మంగళవారం ఉదయం తానే స్వయంగా అసమ్మతి నేతల ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌ పార్టీలోకి ఆహ్వానించడం వారు రెండు మూడు రోజుల్లోనే తామంత కలిసి ఉమ్మడిగా నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. కోదాడ ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్‌ అభ్యర్థిత్వాన్ని బీఆర్‌ఎస్‌ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, సీనియర్‌ నాయకుడు వేనేపల్లి చందర్‌రావుతో పాటు కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీలు కొంతకాలంగా వ్యతిరేకిస్తున్నారు. కానీ పార్టీ రెండు రోజుల క్రితం ఆయనకే బిఫామ్‌ ఇవ్వడంతో వారంతా పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం శశిధర్‌రెడ్డికి చెందిన వ్యవసాయక్షేత్రంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్‌ నేత, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై బీఆర్‌ఎస్‌ అసమ్మతి నేతలను తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దీనికి సమ్మతి తెలిపిన అసమ్మతి నేతలు తామంతా కూర్చొని రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుమంటామని ప్రకటించారు. ఈ సమావేశంలో శశీధర్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి ఏర్నేని బాబు, అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, మోతె ఎంపీపీ ఆశా శ్రీకాంత్‌రెడ్డి, చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, మోతె, అనంతగిరి, చిలుకూరు జడ్పీటీసీలు పుల్లారావు, ఉమా శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబుతో పాటు పలువురు సర్పంచ్‌లు, మున్సిపల్‌ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


చందర్‌రావు ఇంటికి వెళ్లిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చందర్‌రావు ఇంటికి ఎంపీ ఉత్తమ్‌

కోదాడలో ఉన్న బీఆర్‌ఎస్‌ నాయకుడు మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు ఇంటికి మధ్యాహ్నం నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెళ్లి ఆయనను తమ పార్టీలో ఆహ్వానించారు. ఈయన కూడా బొల్లం మల్లయ్యకు టికెట్‌ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తమ్‌ ఆయన ఇంటికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల్లో తామంతా సమావేశం నిర్వహించుకొని పార్టీ మారే తేదీని ప్రకటిస్తామని చందర్‌రావు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్‌ పాండురంగారావు తదితరులు ఉన్నారు.

అసమ్మతి నేతలతోనే నాప్రయాణం : మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

అధికార బీఆర్‌ఎస్‌ పార్టీని వీడే విషయంలో అసమ్మతి నేతలతోనే తన ప్రయాణం ఉంటుందని కోదాడ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ తెలిపారు. తాను హైదరాబాద్‌లో ఉండడం వల్ల మంగళవారం కోదాడలో జరిగిన సమావేశానికి తాను హాజరు కాలేదని, రెండు మూడు రోజుల్లో అందరం కలిసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

మల్లయ్యయాదవ్‌ అనుచరుడి ఇంటికి పద్మావతి

2018 ఎన్నికల్లో మల్లయ్య యాదవ్‌ విజయం సాధించడంలో కీలకంగా వ్యవహరించిన మాజీ కౌన్సిలర్‌ ఇంటికి కోదాడ కాంగ్రెస్‌ అభ్యర్థి నలమాద పద్మావతి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

అధికారంలోకి రాగానే 'గ్యారంటీ' అమలు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల : కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సోమారం గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన రెండు వందల మందితో పాటు నేరేడుచర్ల పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఆవుల కోటేశ్వర్‌రావు, అజయ్‌లు ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వారికి ఉత్తమ్‌ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యే, మంత్రిగా ఎంతో అభివృద్ధి చేసినందునే కాంగ్రెస్‌ పార్టీకి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నార న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, కట్టా రామారావు, ప్రవీణ్‌, బచ్చలకూరి ప్రకాశ్‌, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, రణపంగ నాగయ్య, పాండునాయక్‌, జ్యోతిబాబు, శ్రీను, పిచ్చిరెడ్డి, సైదానాయక్‌, సత్యనారాయణ, నాగరాజు, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


నేరేడుచర్ల : పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎంపీ ఉత్తమ్‌ సమక్షంలో చేరికలు

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో చనగాని సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చనగాని రామయ్య, ఎలుగూరి నరసింహారావు, శాంకూరి సూరయ్య, వెంకన్న, లింగయ్య, తిరపతయ్య, అర్జున్‌, సైదులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం నిరంజన్‌రెడ్డి, గుండు రామాంజిగౌడ్‌, ఎరగాని నాగన్న, విజయ్‌, చాంద్‌పాషా, సీతారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ గెలిస్తేనే పేదల అభివృద్ధి

- కాంగ్రెస్‌ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతి

మోతె : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ గెలుస్తేనే పేదలు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌.పద్మావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కొత్తగూడెం, మామిళ్లగూడెం, హుస్సేనాబాద్‌, తుమ్మలపల్లి గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్‌ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు మాత్యనాయక్‌, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాతంగి బసవయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుందరి కిరణ్‌కుమార్‌

మోతె : జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుందరి కిరణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కింద మండలంలో గత రెండు సంవత్సరాలుగా నిర్వహించిన పనులపై ఓపెన్‌ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు ఏళ్లుగా చేసిన రూ.17.64 కోట్ల పనులపై, చెల్లింపులు చేసిన వాటిపై నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎం అజయ్‌, హెచ్‌ఆర్‌.ప్రవీణ్‌, ఎస్సార్పీ రమేష్‌, విజిలెన్స్‌ అధికారి ఆశారాణి, ఎంపీడీఓ వెంకటాచారి, ఏపీఓ మహేష్‌, ఎంపీఓ హరిసింగ్‌ నాయక్‌ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

కోదాడరూరల్‌ : మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ రాము సూచించారు. మంగళవారం పట్టణ శివారులోని వాకింగ్‌ చేస్తున్న మహిళలకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. చైన్‌ స్నాచింగ్‌లు జరుగుతున్నాయని ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కి, షాపులకు వెళ్లేటప్పుడు ఒంటిపై బంగారు ఆభరణాలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు, 100కు కాల్‌ చేయాలని సూచించారు.

వైద్య శిబిరం


షుగర్‌ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో మంగళవారం నేరేడుచర్ల లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా షుగర్‌ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్‌ చైర్మన్‌ బట్టు మధు, జిలకర రామస్వామి, రామకృష్ణ, సీతారాంరెడ్డి, శ్రీరాంరెడ్డి, క్రాంతికుమార్‌ వైద్య సిబ్బంది శ్రీకాంత్‌, శ్యాం, శ్రీను, రమేష్‌ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి


పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్‌ శ్రీదేవి

మోతె : ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని తహసీల్దార్‌ ప్రకాష్‌రావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో సర్వారం, సిరికొండ గ్రామాల సహకార సంఘాల పరిధిలోని ఆరు కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరారు. సీఈఓలు అనంతరెడ్డి, ఉపేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఐకేపీ అధికారుల సమీక్ష సమావేశం

పాలకవీడు : పంటలు చేతికొచ్చే సమయం దగ్గర పడుతున్నందున ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని తహసీల్దార్‌ శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వ్యవసాయ, ఐకేపీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశాల వివరాలను రెండు రోజుల్లో వెల్లడించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయాధికారి బి.రాజు, ఐకేపీ సీసీ సుజాత, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : ఎన్నికల నేపథ్యంలో చింతలపాలెం మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలానికి వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం యర్రకుంటాతండాలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.3 వేల విలువ గల 5 బీర్లు, 11 క్వార్టర్‌ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. షాపు నిర్వాహకుడు రాగి నాగేశ్వరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మట్టపల్లి వద్ద రూ.1.50 లక్షలు పట్టివేత

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానది వంతెనపై గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం మఠంపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించి రూ.1 లక్షా 50వేలు పట్టుకున్నారు. ఎస్‌ఐ సీహెచ్‌ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం నంద్యాల జిల్లాలోని జూపాడుబంగ్లా మండల కేంద్రానికి చెందిన మల్లె రవిశంకర్‌ తన బొలేరో వాహనంలో ఖమ్మం నుంచి స్వగ్రామానికి రూ.1 లక్షా 50 వేలతో వెళ్తూ మట్టపల్లి చెక్‌పోస్టులో వాహన తనిఖీలలో పట్టుబడ్డాడు. నగదుకు సరియైన ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్‌ చేశామని ఎస్‌ఐ తెలిపారు.


హుజూర్‌నగర్‌ : ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సైదిరెడ్డి

రామాపురం చెక్‌పోస్టు వద్ద రూ.2.81లక్షలు..

కోదాడరూరల్‌: మండలంలోని రామాపురం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌ పోస్టు వద్ద మంగళవారం రూ.2.81లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ నుంచి తెలంగాణలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో నగదు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ దాడులు

- 47 లీటర్ల సారా, 3 వాహనాలు స్వాధీనం


పట్టుబడ్డ వాహనాలు, సారాతో ఎక్సైజ్‌ అధికారులు

హుజూర్‌నగర్‌ : ఎక్సైజ్‌ డిస్ట్రిక్ట్‌ టాస్క్‌ఫోర్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు వేర్వేరుగా దాడులు జరిపి 47 లీటర్ల సారా, 3 వాహనాలు స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్‌ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లికి సారా తరలిస్తున్న భూక్యా గోవింద్‌ను నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు పట్టుకుని అతని వద్ద నుంచి 16 లీటర్ల సారా, టీవీఎస్‌ ఎక్సెల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదే మండలంలోని కొత్తతండాకు చెందిన భూక్యా సేవా మఠంపల్లికి సారా తరలిస్తుండగా అతన్ని పట్టుకుని అతని వద్ద నుంచి 16 లీటర్ల సారా, టీవీఎస్‌ ఎక్సెల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సేవా పారిపోగా అతనిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా జిల్లా డిస్ట్రిక్ట్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు వాహన తనిఖీల్లో భాగంగా మఠంపల్లి మండలం అవిరేనికుంటతండా నుంచి పెదవీడుకు సారా తరలిస్తున్న బాణోతు కొండా వద్ద నుంచి 15 లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఒకరు పారిపోగా ఇరువురిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ శివకృష్ణ, శేఖర్‌రెడ్డి, బ్రహ్మం, ఎక్సైజ్‌ ఎస్‌ఐలు జగన్‌మోహన్‌రెడ్డి, దివ్య, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కోదాడరూరల్‌ : పట్టణంలోని పలు వార్డుల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 14 వార్డులో ప్రతిష్ఠించిన అమ్మవారికి మంగళవారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌ కమదన చందర్‌రావు, భక్తులు, నిర్వాహకులు ఉన్నారు.

అన్నపూర్ణ దేవిగా అమ్మవారు

మేళ్లచెరువు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ వనదుర్గ దేవాలయం, శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయల్లో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌శర్మ, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : దేవీ శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయం, శివాలయాల్లో కనకదుర్గను అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని వేపలసింగారంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు, మాలాధారులు పాల్గొన్నారు.


కోదాడరూరల్‌ : 14వ వార్డులో అమ్మవారి పూజలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ శిరీష

హుజూర్‌నగర్‌ : పట్టణంలోని శ్రీకనకదుర్గ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. పూజారులు, మహిళలు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని కనకదుర్గ దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణా దేవి అలంకరణలో పూజించారు. రఘునాథపాలెం, మట్టపల్లి, పెదవీడు, చౌటపల్లి తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.


మునగాల : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


మఠంపల్లి : అన్నపూర్ణ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ


మేళ్లచెరువులో..

అన్నదానం

మునగాల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగాలలోని భవానీ నగర్‌ మారమ్మ గుడి వీధిలో మంగళవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నల్లపాటి శ్రీనివాసరావు, సర్పంచ్‌ చింతకాయల ఉపేందర్‌, దేవినేని వాసు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో..


నేరేడుచర్ల : శివాలయంలో..

ఓటర్లను చైతన్యపరిచేలా వార్తలు రాయాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడరూరల్‌ : ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిని చైతన్యపరుస్తూ వార్త కథనాలు రాయాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో మీడియా సర్టిఫికేషన్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీస్‌ (ఎంసీఎంసీ) విధానంపై పాత్రికేయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పాత్రికేయులు ఎంసీఎంసీ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాస్టర్‌ ట్రైనర్‌ రమేష్‌ మాట్లాడుతూ పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములు అంటూ వార్తలు రాయొద్దని సూచించారు. అదేవిధంగా పార్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా రాస్తే ఎన్నికల కమిషన్‌ నిబంధనల మేరకు కేసులు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సాయాగౌడ్‌, పాత్రికేయులు, పలు శాఖల అధికారులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ విధిగా అమలు పరచాలి

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఎంసీసీ (మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ను మఠంపల్లి మండలంలో విధిగా అమలు పరచాలని ఎంపీడీఓ జానకిరాములు అన్నారు. మంగళవారం మండలంలోని సుల్తాన్‌పూర్‌తండా, పెదవీడు, మట్టపల్లి, రామచంద్రాపురంతండా తదితర గ్రామ పంచాయతీల్లో ఎంసీసీ బృందంతో కలిసి ఆయన వాల్‌ రైటింగ్‌ చెరిపివేత, విగ్రహాలకు ముసుగుల ఏర్పాటు, ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు తదితర పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సైదులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సుల్తాన్‌పూర్‌తండాలో వాల్‌రైటింగ్‌ చెరిపివేత పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : పాట్నాలో నవంబర్‌ 2 నుంచి 5వ తేదీ వరకు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సహాయ కార్యదర్శి వెంకన్న తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

కోదాడరూరల్‌ : ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ఇర్ల నారపరెడ్డి అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి అండర్‌– 17 వాలీబాల్‌ పోటీలకు ఎంపికైన జె.నీలిమా, జె.పూజిత, జి.కావ్య, కె.హిమబిందు, అండర్‌– 14కి ఎంపికైన కె.ద్రాక్షాయనిని అభినందించి రూ.3వేల నగదు అందజేశారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి 20 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి నల్లగొండ నుంచి ఈ విద్యార్థినులు ప్రాతినిధ్యం వహించనున్నారని హెచ్‌ఎం డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థునులు, పీఈటీ రవిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కె.వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించి నగదు అందజేస్తున్న నారపరెడ్డి

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్‌ : పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు దాతలు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఉన్నారు.


అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు

సర్పంచ్‌కి వినతి

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో వాటర్‌ ప్లాంట్‌, గ్రంథాలయం, పశువైద్యశాలలను నిర్మించాలని కోరుతూ గ్రామ ప్రజలు, యూత్‌ సభ్యులు మంగళవారం సర్పంచ్‌ కర్నాటి నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామంలో వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూత్‌ సభ్యులు తుమ్మలపల్లి సైదులు, పవన్‌, రమేష్‌, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ, కోలాట పోటీలు

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ, కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు పస్తాల కబడ్డీ అసోసియేషన్‌ సభ్యులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలకు 9010996600, 7780446175 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

సర్వారం గ్రామవాసికి డాక్టరేట్‌


బరిగెల నర్సయ్య

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన బరిగల కోటయ్య– సైదమ్మ దంపతుల కుమారుడు బరిగెల నర్సయ్యకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ ప్రకటించింది. ఆచార్య పెదారపు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌డీలో చరిత్ర విభాగంలో రేచర్లరెడ్డి వంశీయుల పరిపాలన – దేవాలయాలు అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ అందజేసినట్లు నర్సయ్య తెలిపారు. నర్సయ్య సర్వారంలో ప్రాథమిక విద్య, లింగగిరిలో 10వ తరగతి, హుజూర్‌నగర్‌లో ఇంటర్మీడియట్‌, డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ చరిత్ర పూర్తి చేశారు. డాక్టరేట్‌ సాధించడం పట్ల నర్సయ్య తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామ సర్పంచ్‌ నాగిరెడ్డి, ప్రజలు అభినందించారు.

వైఎస్సార్‌ టీపీ కోదాడ టికెట్‌కు ఓయూ విద్యార్థి నేత దరఖాస్తు


దరఖాస్తు పత్రం అందజేస్తున్న నాగరాజు

మునగాల : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ కోదాడ నియోజకవర్గ అభ్యర్థిగా తనకు టికెట్‌ ఇవ్వాలని మండలంలోని రేపాల గ్రామానికి చెందిన సోమపంగు నాగరాజు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. నాగరాజు హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చదువుతూ వైఎస్సార్‌టీపీ తెలంగాణ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు.

బీఆర్‌ఎస్‌కు మాజీ సర్పంచ్‌ క్రాంతికుమార్‌ రాజీనామా

నేరేడుచర్ల : బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, పెంచికల్‌దిన్న మాజీ సర్పంచ్‌, గ్రామ తినికేతన్‌ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్‌ మంగళవారం బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మిత్రుడు ఎమ్మెల్యే సైదిరెడ్డి తనకు పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సరైనా గౌరవం, గుర్తింపు ఇచ్చే పార్టీలోకి వెళ్లేందుకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

నడిగూడెం ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓగా ఇమామ్‌


ఇమామ్‌

నడిగూడెం : నడిగూడెం మండల పరిషత్‌ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇమామ్‌ ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన యం.యర్రయ్యను జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపారు. ఇమామ్‌ పాషా విలేకరులతో మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపిక


హర్షవర్ధన్‌

హుజూర్‌నగర్‌ : పట్టణంలోని వీవీఎం స్కూల్‌ విద్యార్థి దేవిశెట్టి హర్షవర్ధన్‌ (అండర్‌ –14) రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన సూర్యాపేటలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీల్లో హర్షవర్ధన్‌ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయలు, విద్యార్థులు పలువురు అతనిని అభినందించారు.

గురుకుల జోనల్‌ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


ఛాంపియన్‌ షిప్‌ అవార్డు అందుకుంటున్న గురుకుల పాఠశాల క్రీడాకారులు

నడిగూడెం : నల్గొండ జిల్లా డిండిలోని గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు జరిగిన గురుకుల పాఠశాలల జోనల్‌ స్థాయి క్రీడల్లో నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల క్రీడాకారులు పలు క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్‌ సీహెచ్‌.ధన విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. అండర్‌– 19 విభాగంలో క్యారమ్స్‌, టెన్నీ కా యిడ్‌, ఖోఖో, వాలీబాల్‌, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు, అండర్‌ – 17 విభాగంలో కబడ్డీ, టెన్నీకాయిడ్‌, క్యారెమ్స్‌, ఖోఖో, 1500 మీటర్ల పరుగు పోటీలు, అండర్‌– 14 విభాగంలో లాంగ్‌ జంప్‌, చెస్‌, కబడ్డీ, టెన్నీకాయిడ్‌, లా ంగ్‌జంప్‌, క్యారమ్స్‌ ఆటల్లో సత్తా చాటి జోనల్‌ స్థాయిలో ఛాంపియన్‌లుగా నిలిచినట్లు తెలిపారు.